# కడుపుమంట

శ్రీ తిరుమలరావు

ప్రొద్దస్తమాను కష్టపడి సాయంత్ర మయ్యేటప్పటికి వెంకయ్య కొట్టుమీద కొచ్చే పాటకజనాన్ని చూస్తే ప్రపంచంలో గొప్పలోటు కనిపించింది. ఆ అలసిపోయిన ముఖాలు, ఆకలి ఆకలి అని ప్రతిధ్వనించే కడుపులు దీనముగా వున్నా, ఏదో జీవితంలో మిణుకు మిణుకు మనే ఆశతోవున్న చూపులు, చూస్తే, విశ్వానికి గుండె కరిగి పోతూ వుండేది. చదువుకుంటున్నప్పుడు, పల్లెటూళ్లు వెళ్ళి వుందామని, అచ్చటివారికి రాత్రిపూట బళ్లూఅవీ పెట్టి విద్యావంతులను చేద్దామని, యింకా ఏవేవో, గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమంలో వున్న సంగతులన్నీ చేద్దామని ఆలోచించేవాడు. కాని ప్రస్తుతం వాళ్ళను చూస్తే, వాళ్ళకు చదువేమి టనిపించింది. కడుపుమంటలతో కాలం గడుపుతూ బ్రతుకుటే భారంగా వున్నవాళ్ళకు వ్రాయటం, చదువటం, ఎందుకు? విద్యంటే వ్రాయటం చదువటం కాదని ఈ దిన దిన గండం తప్పే మార్గం వాళ్ళకు చూపించటమే అసలయిన విద్యయని అతనికి తోచింది. కాని ఏం చేస్తాడు పాపం!



ఇంటెల్లిపాదీ ఆనందబాష్పాలు కార్చారు, విశ్వమోహన్ బి.ఏ. పరీక్ష యూనివర్సిటీ ఫస్టుగా ప్యాసయినందుకు. ఇంటెల్లిపాదీ అంటే ఎవరున్నారు పాపం, అతనికి—చిన్నప్పుడే పోయాడుతండ్రి. ఇంక మిగిలింది తల్లి రంగమ్మ, 12-ఏండ్ల వయస్సు చెల్లెలు సీత. తల్లి చాలా కష్టపడి చెప్పించింది చదువు. మొదటిలో చాలా ఆస్తిమంతులైనా, కరిగించుకు తింటూంటే ఎన్నాళ్ళొస్తుంది! పూర్వపుపేరు తప్ప ప్రస్తుతం ఎక్కువ ఏమీ లేదని చెప్పొచ్చు. కొడుకు చదువు పూర్తితో తమ కష్టాలు యింక గట్టెక్కినయని మురిసిపోతోంది తల్లి. మా అన్నయ్య ఫస్టున ప్యాయిన నాడుట అని ఆశ్చర్యంగా చెపుతూంది తన తోడిపిల్లలతో సీత.

తెలివితేటలంటే వున్నయి. రీతులంటే ప్యాసయాడు. అతనికి చిన్నప్పటినుంచీ వచ్చిన మెడల్సే వున్నయి ఒక యిరవై కాసుల బంగారం. వుద్యోగా లెక్కడున్నయి. విశ్వానికి బి. ఏ. ప్యాసయితేగాని పెళ్ళిచ్యెయనని ఏదో పిచ్చిపట్టు మీద వూరుకుంది రంగమ్మ—అతని అదృష్టవశాత్తు అతనికి పరీక్ష ప్యాసయేటప్పటికి 20 సంవత్సరాలు నిండినయి.

అతని నేత్రాలు ఆలోచనా పూరితాలు. ప్రపంచంలో వున్న విషాదమంతా అతని ముఖంలో తాండవిస్తూ వుంటుంది. అతడు తన ఆశయాల్ని ప్రపంచానికి పదడుగులు ముందర పరిగెత్తిస్తూ వుంటాడు. అతనికి జీవితం అంటే ఏమిటో తెలీదు. చదువైంది అనేటప్పటికి ప్రపంచంలో ఒకవిధమైన శూన్యత కన

పించింది. అయినా అతనేమీ ఆ విషయంలో ఆలోచించ దలచుకోలేదు. అతనికి వాళ్ళ వూరంటే చాలా ప్రీతి. తల్లికి స్వంతవూరు వెళదామని నచ్చజెప్పి మంచి రోజుచూచి బయలుదేరి స్వగ్రామం 'ప్రొద్దుటూరు' చేరుకున్నారు.

విశ్వానికి బాగా జ్ఞానంవచ్చిన తరువాత వాళ్ళవూళ్ళో ఎప్పుడూ అన్నాళ్లు వుండలేదు. 10, 12-ఏండ్లనుంచి బాగా పట్టణంలో వుండటం అలవాటయింది. కాని అతనికి పట్టణవాసమంటే అదో విధమయిన ఏవగింపు. అది జీవితంలో వున్న ప్రశాంతాన్ని భంగం చేస్తుందని అతని భయం.

సొంతవూరని పేరేతప్ప అతని కావూళ్ళో ఒక యిల్లు తప్ప వేరేమీలేదు. విశ్వమోహనుని చూస్తే వూళ్ళో రైతులందరు చాలాగౌరవంగా చూచేవారు. అతను చదువుకుండే రోజుల్లో ఎప్పుడేనా వెళ్ళినప్పుడు మనవూరు వచ్చేస్తానోయీ అని వాళ్ళతో అంటే, 'మీరెందు కొస్తారుబాబూ! ఏదో పెద్దపెద్ద చదువులు చదివి 'కలకటేరీ' వుద్యోగాలు చేశేవారు' అని రైతులనేవాళ్ళు. చదువుకుండే వాళ్ళనుచూస్తే వాళ్ళకుండే అమాయకపు గౌరవానికి అతనికి నవ్వు, విచారము, రెండూ కలిగేవి-ప్రస్తుతం ఆవూ రెందు కొచ్చాడో అతనికే తెలీదు. అక్కడుండి చేసేదేమని తన స్వగ్రామమే వచ్చాడు. ఏదో గౌరవమైన కుటుంబం అవటంచేత వెంకయ్య కొట్లో కాతాపెట్టడానికి అవకాశం దొరికింది.

విశ్వానికేమీ పని లేకపోవడంచేత సాయంత్రం పూట వెంకయ్య కొట్టుమీదకెళ్ళి కూర్చుండేవాడు. రోజూ గూడెంనుంచి గుంపులు గుంపులుగావచ్చి దినసరి వెచ్చాలు కొనుక్కుపోతూ వుండేవారు. ఒక దమ్మిడీకి చింతపండు వుప్పు, ఒకదమ్మిడీకి, బెల్లం ఇంకొక దమ్మిడీకి, నూనెబొట్టు యివ్వండని ఒక కానిడబ్బుయిచ్చి సరకులు తీసుకొని, ఒక వెల్లుల్లిపాయ కొసరు తీసుకుపోయింది ఒకతె. ఒక డొక తవ్వెడువడ్లిచ్చి, కిరసనాయిలు, చింతపండు, వుప్పు మిరపకాయ తీసుకుపోయాడు. ఈబేరాలుచూస్తే విశ్వానికి చాలా ఆశ్చర్యమేసింది. ఎవరి బేరంకూడా అర్ధణాకంటే మించదు. ఈ కాస్తలో ఎలా సరిపుచ్చుకుంటారా అని అతనికి ఒకటే ఆలోచన. ప్రొద్దస్తమానూ కష్టపడి సాయంత్రమయ్యేటప్పటికి వెంకయ్య కొట్టుమీద కొచ్చే పాటకపు జనాన్ని చూస్తే ప్రపంచంలో గొప్పలోటు కనిపించింది. ఆ అలసిపోయిన ముఖాలు, ఆకలి ఆకలి అని ప్రతిధ్వనించే కడుపులు దీనముగావున్నా, ఏదో జీవితంలో మిణుకు, మిణుకు మనే ఆశతోవున్న చూపులు, చూస్తే, విశ్వానికి గుండె కరిగిపోతూ వుండేది. చదువుకుంటున్నప్పుడు, పల్లెటూళ్ళు వెళ్ళి వుందామని, అచ్చటివారికి రాత్రిపూట బళ్లూఅవీ పెట్టి విద్యావంతులను చేద్దామని, యింకా ఏవేవో, గ్రామపునర్నిర్మాణ కార్యక్రమంలో వున్నసంగతులన్నీ చేద్దామని ఆలోచించేవాడు. కాని ప్రస్తుతం వాళ్లను చూస్తే, వాళ్ళకు చదువేమి టనిపించింది, కడుపుమంటలతో కాలంగడుపుతూ బ్రతుకుటే భారంగా వున్నవాళ్ళకు వ్రాయటం,చదువటం ఎందుకు? విద్యంటే వ్రాయటం చదువటం కాదని ఈ ఆకలిమంటల్లోంచి బయటకొచ్చే వుపాయం, ఈదినదిన గండం తప్పే మార్గం వాళ్ళకు చూపించటమే అసలయిన విద్యని అతనికి తోచింది. కాని ఏంచేస్తాడు పాపం.

ఇంక రైతులున్నారంటే తలమునిగి తాడిప్రమాణ మన్న ట్లున్నారు. అప్పట్లో వచ్చేదేదో భుక్తికి సరిపోతుంది. లేకపోతే, ఏదో తాకట్టో వాకట్టో పెట్టి కట్టవల్సిందే; కట్టకపోతే ఆకాస్త భూమిఆధారం కూడా పోతుందిగా!

ఆ వూళ్ళో కల్లా,—తినకపోయినా- తింటానికున్నది ఒక్క వెంకయ్యకే. అతని దగ్గర రొఖం కాగితాలు, కలుపుకొని ఒక లక్ష రూపాయిలకుపై నుంట

వని ప్రతీతి. అతన్నిగూర్చి కథగాచెప్పుకుంటారు; ఇరువది సంవత్సరాలకుముందు పైమీది గుడ్డతో వచ్చి యిప్పుడింత డబ్బు సంపాదించాడని, మంచి అదృష్ట జాతకుడని అనుకుండేవారు ప్రజలు. అదంతా తామిచ్చిందేనని పాపం వాళ్ళకు గుర్తులేదు. పెళ్ళిలేదు, పెటాకులులేవు. వుండేది ఒక్కడు. డబ్బు పెంచటం తప్ప అతనికి జీవితంలో వేరే ఆశయంలేదు. ఇంట్లో వున్న చెంబూ తప్పేలా దగ్గరనుంచీ కూడా తాకట్లు బాపతే. బాగా డబ్బు వుండటంచేత దూరపు బంధువులు కూడా ఎప్పుడేనా వచ్చి యోగక్షేమం కనుక్కొని పోతుండేవారు—చచ్చేటప్పుడేమైనా యిస్తాడేమోనని. వాళ్ళు ఒక పూటుంటే, రెండోపూట వెళ్ళిరమ్మని చెపుతాడు.

బాకీలు వసూలు చెయ్యడంలో, ఎవరేనా వెంకయ్య తరువాతే. ఎన్నాళ్ళని పూరుకుంటాడు-విశ్వమోహన్ కాతాపెట్టి మూడు నెలలయింది. కానీ యివ్వలేదు. మొదట కొంచెం చూచాయగా అడిగాడు. తరువాత కొంచెం వత్తిడి చేయుటం మొదలుపెట్టాడు. అసలు బాకీ అంటేనే తలనొప్పి విశ్వానికి. అందులో వత్తిడి చేస్తున్నాడంటే చాలా చిన్నతనమనిపించింది. చేతిలో కానీలేదు. దమ్మిడీ వచ్చే సాధనం లేదు. ఇంక గత్యంతరం లేక తనకు యూనివర్సిటీ వాళ్ళిచ్చిన మూడు మెడల్సు అమ్మి బాకీ తీర్చాడు. ఇంక మళ్ళీ కొన్నాళ్ళవరకు యిబ్బందిలేదని నిట్టూర్పు విడిచాడు.

ప్రపంచంలో డబ్బులేని జీవితం వృథాగా అని ఆలోచిస్తూ వుండేవాడు. చెల్లెకి పెళ్ళీడొచ్చిందని తొందర పడుతూంది తల్లి. ఎక్కడ దొరుకుతాయి సంబంధాలు. సీత అందంగా వుంటుంది, చురుకైనపిల్ల. కాని ఏమి లాభం- తిండానికున్నా లేకపోయినా, వాళ్ళబ్బాయిలకు, పెద్ద కట్నాలు, అప్సరసల్లాంటి పిల్ల కావాలని విర్రవీగుతారు మొగపిల్లల తల్లులు. దారిని పోయే వాడికి, చూస్తూ, చూస్తూ యివ్వలేరుకదా! పక్కనే వున్న తులసీపురం కరణానికి సంబంధం కోసం తిరుగుతున్నారు. మన పిల్ల నిస్తామంటే ఎగరేసుకు చేసకుంటారు; అతనికి చాలా డబ్బుంది, 7,8 అరకల వ్యవసాయం, చాలా పలుకుబడి వున్నవాడు, మనకు కూడా చాలా అండగా వుంటాడు; నీ వుద్దేశ మేమిటంది తల్లి. ఆ మాటలు వినేటప్పటికి వుగ్రుడయాడు మోహన్. ఈ దరిద్రంలో చావనన్నా చద్దాంగాని, ఆ మూడోపెళ్ళి ముసలి వెధవికి నా చెల్లె నిస్తానని కల్లోనయినా అనుకోవద్దని ఒక్క రంకెవేశాడు. డబ్బులేదు కాని, నాలో మానవత్వం చావలేదు, ఆ కటికపని చేతులారా చేయనన్నాడు. కాని రంగమ్మ ఆ విషయంలో కొంచెం పట్టుదలగానే వుంది. డబ్బుకోసం గదా, కన్న తల్లికూడా, కడుపుతీపి చంపుకొని యిట్లా అంటోంది అనుకున్నాడు. డబ్బు డబ్బు అని ఏదో గుండెల్లో గుద్ది చెప్పుతున్నట్లయింది.

మోహన్‌కు, యింట్లో సంగతి చూచినా బయట సంగతి చూచినా బుర్ర తిరగడం తప్ప ఏమీతోచలేదు. ఒక రోజు సాయంత్రం యీ ప్రపంచానికి కొంచెం దూరంగా వుంటే మంచిదని చాలా దూరం షికారుపోయి ఒక చెట్టుక్రింద కూర్చున్నాడు—అతనెంత వద్దనుకున్నా ఆలోచనమీద ఆలోచన పరుగెత్తటం మొదలు పెట్టింది. తాను యిన్నాళ్ళు పట్నంలో చూచింది బూటక ప్రపంచం. అది మసిబూసిన మారేడుకాయ. ఇప్పుడు చూస్తున్నదే నిజం. తాను చదువుకుండే రోజుల్లో ఎన్నో దేశసమస్యలమీద కబుర్లు కొట్టాడు. సామ్యవాద సిద్ధాంతాన్ని బలపరుస్తూ బల్లగుద్ది అనేక 'డిబేట్లలో వాదించాడు. పల్లెటూళ్ళలో ప్రశాంత జీవనమని అచ్చట సౌఖ్యం తప్ప మరేంలేదని వువ్విళ్ళూరుతూ వుండేవాడు. చదువుకున్న వాళ్ళంతా పల్లెటూళ్ళకు వెళ్లకపోబట్టే మన దేశానికిట్టి దుర్దశ అని వాదిస్తూ వుండేవాడు. చదువు పూర్తిచేసి వచ్చేటప్పటికే వున్నది కాస్తా అయిపోతుంది. మనకు రెండు

పూట్లకీ తింటానికి వుంటేకదూ, ఇతరుల సంగతి ఆలోచించటానికి! అయినా వాళ్ళకు కావలసింది రెండుపూట్లా కడుపునిండా అన్నం. సంపాదించినది కాస్తా అప్పులకు సరిపోతుంది. ఇంక వాళ్ళు తినే దేముంది. వెంకయ్య కొట్టు దగ్గిర చూసే ప్రేతముఖాలన్నీ 'రీల్' వెంట 'రీల్' పరుగెత్తినట్లు కనుపిస్తున్నయి. వీటన్నిటికీ మోక్షం ఎప్పుడా అని తీవ్రంగా ఆలోచిస్తునాడు. కారు చీకట్లు నాలుగువేపులా క్రమ్మినయి. అది మాత్రం అతను గమనించలేదు. ఏదో తట్టినది ఆతనికి. ముఖంలో నూతన వికాసం కలిగింది. పట్టలేని ఆవేదనతో పళ్ళు బిగించి గుడ్లు వురిమి నేలమీద ఒక్క తన్ను తన్ని తన అభిప్రాయానికి చేయూత నిచ్చాడు. చీకటి చూసేటప్పటికి అతనికి ఆశ్చర్యమేసింది. పైకిచూస్తే నక్షత్రాలు మిణుకు, మిణుకు మంటూ చిరునవ్వు నవ్వినట్లయింది. అతని వుద్రేకాన్ని చూడలేక చంద్రుడుకూడా కాంతిని గోల్పొయాడు ఆ పక్షంలో. ఇంటిముఖం పట్టాడు విశ్వమోహన్. డబ్బు, డబ్బు, అని అతని చెవుల్లో గింగురుమనిపిస్తోంది కీచురాయి.

అవాళ అమావాస్య. చీకటిపడి విశ్వం తనయింటికి రావడంచూచి, "ఏమండీబాబూ యిలా వచ్చార"న్నాడు వెంకయ్య. "ఏమీలేదు, నాదగ్గిర కొంత బంగారం వుంది, అది నీకు బేరంపెట్టాలనుకున్నాను; అమ్మచూస్తే ప్రాణంమీది కొస్తుంది. ఎప్పుడు రమ్మంటావ"న్నాడు. వెంకయ్యకి దొంగసొమ్ములంటే మహాయిష్టం. సగానికి సగంవుంటే ఎంత మంచిబంగారమయినా చచ్చినాయివ్వడు. చాటుగుండా యేదో అవుసరానికి అమ్ముతున్నాడుగదా యింకా చవుకగా యిస్తాడని, 'సరేబాబూ, మీచిత్తం వచ్చినప్పుడు రండ' న్నాడు. అయితే 'ఒంటిగంట కొస్తాను, తలుపు తట్టగానే తియ్యమ'న్నాడు. 'అయ్యో! పంతులుగారూ, నేనిద్రపోతానా, మీకోసం ఎదురుచూస్తూ వుంటావ'న్నాడు వెంకయ్య.

విశ్వం యింటికి పోయి నాలుగు మెతుకులు తిని, తనగదిలో పడుకున్నట్లు పడుకున్నాడు. సీత పెందలకడనే నిద్రపోయింది. రంగమ్మకూడా పిండికాస్తా తిని, పనిచేసుకొని వచ్చి పడుకుంది.

వూరంతా మాటుమణిగింది. మోహన్ కి మాత్రం క్షణ మొక యుగంగా వుంది. కాల మతిక్రమించిన కొద్దీ హృదయం వేగంగా కొట్టుకోడం మొదలెట్టింది. దాదాపు 1-గంట అయినట్లు 'బిగ్ బెన్' గడియారం చెప్పింది. లేచి పెట్టె తీశాడు. తన మెడల్సు పెట్టె తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. ఇంకోటేదో తీసుకొని చంకలో పెట్టుకొని పైన వుత్తరీయం కప్పుకొని దొడ్డి దోవనే బయలుదేరి వెళ్ళి వర్తకుని దొడ్డి తలుపుతట్టాడు. తలుపు తీయగానే, వెంకయ్య అతను లోపల ప్రవేశించారు.

వెంకయ్య ఏదో నల్లటి రాయిమీద ఒక "మెడల్" పెట్టి గీసి తన దగ్గిరున్న కాసుగీటుకు సరిపోయిందో లేదో అని కళ్ళు పెద్దవిచేసి ముందుకు బాగా వంగి చూస్తున్నాడు. విశ్వం ముఖంలో అనేక భావాలు ప్రకటింప బడ్డాయి. సెట్టిమాత్రం చూడలేదు. ఇంకొక 'మెడల్' పరీక్షచేస్తున్నాడు. అన్నిభావాల్ని దిగమ్రింగాడు విశ్వం. పళ్ళు, వూపిరిబిగించి, చంకలో వున్న గొడ్డలి కత్తితో ఒకదెబ్బ వేశాడు. వేటుకు వెలక్కాయ రాలినట్లు రాలింది వెంకయ్య తలకాయ. మొండెం ముందుకు వంగి చూస్తోంది, తన అవివేకాన్ని.

ఇంక తన తెలివితేటలు కనుపర్చి, పట్టుబడకుండా వుంటేగాని, చేసిన పనంతా వృథా అవుతుందని అన్నీ జాగ్రత్తగా చేయడం మొదలుపెట్టాడు. అతడదివరకు అనేక 'డిటెక్టివ్' నవలలు యింగ్లీషులో చదివాడు. అమెరికాదేశంలో పట్టపగలు జరిగే దురంతాలను పత్రికలద్వారా వినివున్నాడు. పోలీసువాళ్ళ తెలివితేటలు కూడా అతనికిబాగా తెలుసును. అతనికి యివన్నీ అసామాన్యమైన ధైర్యాన్ని, నిపుణతను యిచ్చాయి.

తన మెడల్నో కత్తి ఒక మూటకట్టాడు. గీటురాయి తీసి భోషాణం క్రింద పారేశాడు.

శెట్టి బొడ్లోవున్న తాళం చెవులగుత్తి తీసుకొని భోషాణం తెరచాడు. అతని కళ్ళు భైరులుకమ్మినయి. ఒక బిందెనిండా వున్నయి బంగారపు వస్తువులు రూపాయలును. ఇంకొక బిందెనిండా వున్నయి నోట్లకట్టలు. నోట్లు మూటకట్టాడు. రూపాయలు కదిపితే చప్పుడవుతుందని బిందెపళంగానే పట్టుకొని, మళ్ళీ భోషాణం వేసి దొడ్డిదోవనే చప్పుడికాకుండా యింటికి చేరుకున్నాడు. దొడ్లో మూలగా ఒక గొయ్యితీసి, నోట్లన్నీ ఒక చిన్నకుండ వుంటే అందులోపెట్టి, పైన మూతగా గుడ్డలుకుక్కి ఈ రెండూ పక్క, పక్కనే, పాతిపెట్టాడు. కట్టుకున్న గుడ్డలన్నీ కత్తితో సహా యింకొకచోట పాతిపెట్టి, ఒక కొల్లాయి మాత్రం కట్టుకొని గదిలో తలుపేసుకొని పచారుచేస్తున్నాడు. ఇంతలోకే కోడి కూయటంచేత రంగమ్మ పాచి పని చేసు కోటానికి లేచింది. తెల్లవారకుండానే శుభ్రంగా స్నానం చేసి మంచి యిస్త్రీబట్టలు తీసి కట్టుకున్నాడు విశ్వం. అవాళ సూర్యుడు నవ్వుతూవచ్చాడు.

తెల్లవారి ఎనిమిదిగంటలకల్లా వెంకయ్యా నెవరో హత్య చేశారని వూరంతా తెలిసింది. 10-గంటలకల్లా పోలీసు ఇనస్పెక్టరు పదిమంది జవానులతో వచ్చాడు. పంచాయితీ చేసి యిల్లంతా ఆమూలాగ్రంగా పరీక్షచేశారు. వూళ్ళోవాళ్ళల్లోకల్లా, విశ్వానికి పంచాయితీలో అగ్రస్థానం. ప్రతిఅడుక్కీ అతనిముఖభావాలు మారుతున్నా వాటిని చాలాభాగం మరుగుపుచ్చుకొని చాలా నిపుణతతో మెలగాడు— అంతే పరీక్షచేసి అలసు కూచుండగా ఎవరో నరికినారని నిర్ధారథచేశారు పంచాయితీదార్లు. పీనుగను పరీక్షకు పంపారు 'డి. యం. ఓ' దగ్గరకు.

కర్ణంగారికి మయిల రావటంచేత ఇనస్పెక్టర్ని తనయింటికి భోజనానికి అహ్వానంచేశాడు విశ్వం. ఇద్దరూ భోజనం చేస్తున్నంతసేపూ దీన్నిగూర్చే మాట్లాడుకున్నారు. ఎవరికీ ఏమీ పాలుపోవటంలేదు. తరువాత విచారణ మీద తేలిందేమిటంటే ఆ క్రిందటిరోజు సాయంత్రం కొండడనే 'కే. డీ.' రకంలోవాడు, వెంకయ్యతో ఏదో దెబ్బలాడినట్లు, ఘర్షణపెరిగి, వాడు కోపంగా ఏవేవో కూసిపోయినట్లు అందుచేత పగ తీర్చుకోటానికి వాడే చంపి వుంటాడని అనుకొని కొండడిని వాడి గ్యాంగులో ఇంకొక యిద్దరుముగ్గురు మనుష్యులను గూడెంలోంచి అరెస్టుచేసి తీసుకుపోయారు. నిర్దోషులను అరెస్టు చేశారనేటప్పటికి విశ్వం భరించలేకపోయాడు. ఇనస్పెక్టరుతో చాలాసేపు వాళ్ల నిర్దోషిత్వాన్నిగూర్చి వాదించాడు. నిజం విచారణమీద గాని తెలియదని వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టరు.

వెంకయ్యయిల్లు తాళంవేసి వెళ్ళారు పోలీసులు. గూడెంలో ఈ అరెస్టుల మూలకంగా చాలా అలజడిగా వున్నది. విశ్వం, వాళ్ల ప్రాణానికి ప్రాణ మడ్డం వేస్తాను, మీరేమీ భయపడవద్దని వూళ్ళో వాళ్లందరకు నచ్చజెప్పిఆ కేసు విషయంలో తీవ్రంగా పనిచేయటం మొదలుపెట్టాడు. సంసారం గుట్టుగా వుండటంచేత, వూళ్ళో వాళ్ళందరికి యింకా వాళ్లు పూర్వం లాగే విశ్వం వాళ్లు గొప్పవారని అభిప్రాయం. వూరికే ఎక్కువ అను

పూర్ణచంద్రోదయమకరధ్వజ
యౌవనము కలిగించి సంభోగ
శక్తి నివృద్ధిపర్చును బంగార
ముకలిసినది. క్షయ, పాండు
వ, సుఖవ్యాధులకు గ్యారంటీ
యివ్వబడును.
100 మాత్రలు 4-0-0
50. 2-8-0; 25. 1-6-0.
డాక్టరు:- జి. యస్. రావు
ఆంధ్ర మెడికల్ స్టోర్సు
మచిలీపట్నం.

మానం కలుగకుండా వుండగలందుకు, వూళ్ళోకొద్దిగా చందాలు పోగుచేశాడు-వాళ్ల విషయంలో దెబ్బలాడ లాటానికి—

కేసు విచారణకు వచ్చింది. డాక్టరు అది హత్య అని నిర్ధారణ చేసినాడు. సాక్షులు చాలామందిని విచారణచేశారు. వాయిదాపయినవాయిదా పడుతోంది. సాక్షులంతా కూడా వాళ్లు అమాయకులని ఈమధ్య, పూర్వం మల్లే "కే.డీ" పనులు చేయటం లేదని చెప్పారు. విశ్వం చెన్నపట్నం నుంచి పెద్దపెద్ద 'క్రిమినల్‌లాయర్లని, పిలిపించాడు. సాక్ష్యపు బలం లేకపోవటం చేత కేసు కొట్టేసి వాళ్లను విడుదల చేశారు. వూళ్ళో వాళ్లందరికీ విశ్వంమీద ఒక విధమైన వెర్రి అభిమానం ఏర్పడ్డది.

కాని విశ్వం ఆవూరులో కొన్నాళ్లవరకు వుండ కూడదని నిశ్చయం చేసుకొని సకుటుంబంగా, మరల కొద్ది కాలంలో వస్తానని వూళ్లో చెప్పి, బయలుదేరి వెళ్లాడు, నాలుగు సంవత్సరాల పాటు అతనెక్కడున్నాడో ఎవరికీ తెలియదు!

ఇప్పుడు సీత గొప్పయింటివారి కోడలు. ఆమె భర్త మూడవ సంవత్సరము యం. బి. బి. యస్. చదువుతున్నాడు. సీత అత్తారింట్లోనే వుండటంచేత బాధ్యతేమీ లేదు మోహనానికి. ఇంక మిగిలింది తానూ తల్లీ. అతను స్వగ్రామం చేరుకుండేటప్పటికి 70,000 రూపాయిలు రొఖం వుంది.

అందులో 10,000 రూపాయిలూ బీదసాదలకు వందరూపాయిలకు మించకుండా, వడ్డీ లేకుండా, వాయిదాల ప్రకారం చెల్లించుకుండేటట్లు ఏర్పాటుచేశాడు. పదివేల రూపాయిలు పెట్టి బీదసాదలు చదువుకోటానికి, నివసించటానికి వీలుగా ఒక చిన్న విద్యాలయం, హాస్టలు కట్టాడు. దానికి ఖర్చుక్రింద సాలీనా రాబడి మాత్రం ఖర్చుపెట్టేటట్లు అరువదివేల రూపాయిల ఆస్తిని కొన్నాడు. ఇంక కొన్నివేలు ఖర్చుపెట్టి హరిజనులకు వాసయోగ్యమైన స్థలములు కొని యిచ్చాడు. మాదిగగూడెంలో నీళ్లకిబ్బందిగా వుండటంచేత బ్రహ్మాండమైన రెండు బావులు త్రవ్వించాడు. వూరిలో ఒక గ్రంథాలయము దానిని నడుపుటకు కొంత డబ్బు ఏర్పాటు చేశాడు. సంవత్సరం పొడుగున 50 మగ్గములు రాట్నములుకు తక్కువ లేకుండా పనిచేయునట్లు ఏర్పాటు చేయటంచేత బీదవాళ్లకు కూలికి లోటుండేది కాదు.

ఇతని ప్రోత్సాహంవలన చుట్టుప్రక్కల వూళ్ల నుంచి కూడా చదువుకోటానికి పిల్లలు వచ్చేవారు. వారల కెక్కువగా జాతీయవిద్య, వృత్తి విద్యలు నేర్పేటట్లు ఏర్పాటు చేశాడు. చదువుకోడం ముఖ్యమని మనము కుల మత భేధములతో దెబ్బలాడ కూడదని, అంతా దేవుని పుత్రులమని మానవ సేవకు మించినసేవ లేదని వాళ్లకు బోధిస్తూ వుండేవాడు.

తాను చేసిన ఘోరమునకు ప్రాయశ్చిత్తంగా యావజ్జీవం బ్రహ్మచర్య దీక్షతోనే వున్నాడు. అతని ఔదార్యాన్ని చూచి అతను చెప్పేదే వేద వాక్కుగా పాటించే వారు జనమంతా. వాళ్ల ఔన్నత్యం కోసమే సర్వదా పాటుబడుతూ, కాలగర్భంలో లీనమయిపోటానికి ప్రయాణం చేస్తున్నాడు, ఆ పవిత్రజీవి.

విశ్వమోహన్ చాలా ఔదార్యబుద్ధి గలవాడవటం చేత భగవంతుని కృపగలిగి అతనికేదో, లాటరీలో చాలా డబ్బు వచ్చిందని, దాన్ని దేశ సౌభాగ్యం కోసం వినియోగం చేస్తున్నాడని ప్రజల్లో పుకారు.—